## క్లుప్తంగా

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న మెడికలాఫీసర్

**పులిచెర్ల(కల్లూరు):** ప్రస్తుతం వర్షాల సీజన్ మొదలవడం, వాతావరణం మార్పుల వలనన సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కల్లూరు పీహెచ్‌సీ మెడికలాఫీసర్ డాక్టర్ జానకీ రావు అన్నారు. పాతపేట పంచాయతీ శాంతినగర్‌లో శుక్రవారం ప్రజలకు వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇళ్లమధ్యన మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. జ్వరాల బారిన పడితే ఆస్పత్రుల్లో చికిత్స పొందాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శారద, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### సమగ్ర భూ సర్వేపై శిక్షణ



**రొంపిచెర్ల:** గ్రామాల్లో సమగ్ర భూ సర్వే చేయాలని తహసీల్దార్ అమరనాథ్ ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన వీఆర్‌ఓ, సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఏలకు సమగ్ర భూ సర్వేపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోను భూ సర్వే చేయాలన్నారు. ప్రతి సర్వే నంబరును పరిశీలించి ఎంత విస్తీర్ణం ఉంది? పట్టాదారు పాసు పుస్తకాలలో తేడాలు ఏమైనా ఉన్నాయా? అని గుర్తించి పరిష్కరించాలని అన్నారు. మ్యుటేషన్‌తో రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణారెడ్డి, ఆర్‌ఐ అబ్దుల్‌ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తిగత శుభ్రతపై అవగాహన



కల్లూరు హైస్కూల్లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

**పులిచెర్ల(కల్లూరు):** కల్లూరు హైస్కూల్లో శుక్రవారం విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, మరుగుదొడ్ల వినియోగం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ అంశాలపై 15 రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ప్రధానోపాధ్యాయురాలు శ్రీవాణి తెలిపారు. తొలిరోజు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### గురుకుల పాఠశాల తనిఖీ



మొక్కలు నాటుతున్న కృష్ణమోహన్

**సదుం:** స్థానిక ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను గురుకుల పాఠశాల కార్యదర్శి కృష్ణమోహన్ శుక్రవారం తనిఖీ చేశారు. వసతి సౌకర్యాలు, బోధనపై విద్యార్థులను ఆరా తీశారు. మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఏజీఓ రాజేంద్రనాథరెడ్డి, కలికిరి, సదుం కన్వీనర్ ప్రిన్సిపాళ్లు సోమశేఖర్, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

### ఉలవలు పంపిణీ



విత్తనాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాజ్‌గోపాల్

**రామకుప్పం:** మండలంలోని బందార్లపల్లె రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతులకు 80శాతం సబ్సిడీపై ఉలవ విత్తనాలను స్థానిక సర్పంచ్ రాజ్‌గోపాల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు కేశవరెడ్డి, రామకృష్ణప్ప, రైతు భరోసా కేంద్రం అధికారి తిప్పేస్వామి, రైతులు పాల్గొన్నారు.

### ఎండీయూ వాహనాల తనిఖీ



రేషన్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ మురళి

**రామకుప్పం:** రేషన్ డోర్ డెలివరీ వాహనాలను శుక్రవారం తహసీల్దార్ మురళి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని మిట్టపల్లె, సగినేకుప్పం గ్రామాల్లో రేషన్ బియ్యం పంపిణీని ఆయన పరిశీలించారు. నిత్యావసర సరుకులు సకాలంలో అందుతున్నాయా? లేదా? అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు రేషన్‌ను లబ్ధిదారులకు ఇవ్వాలని ఎండీయూ ఆపరేటర్లను ఆదేశించారు.

# పుంగనూరుపై సీఎంకు ప్రత్యేక అభిమానం

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- రైతులకు వ్యవసాయ పనిముట్లు, చిరు వ్యాపారులకు సోలార్ లైట్లు పంపిణీ



వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**సదుం:** పుంగనూరు నియోజకవర్గంపై ప్రత్యేక అభిమానంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు అభివృద్ధి పనులు మంజూరు చేస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నూతన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. కొందరికి సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసి సభలో మాట్లాడారు. ఇక నుంచి సోమల, సదుం, పులిచెర్ల మండలాల ప్రజలకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సేవలు పూర్తి స్థాయిలో అందుతాయన్నారు. గతంలో ఈ సేవల కోసం పీలేరు, పుంగనూరుకు వెళ్లాల్సి వచ్చేదని, ఇది మహిళలు, వృద్ధులకు ఇబ్బందిగా ఉండటంతో స్థానికంగా కార్యాలయం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మండలానికి సబ్ రిజిస్ట్రార్, యాభై పడకల ఆసుపత్రి, ఫైర్‌స్టేషన్ తదితర కార్యాలయాలను ప్రత్యేక అభిమానంతో సీఎం మంజూరు చేశారని ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**వ్యవసాయ పనిముట్లు పంపిణీ**

పీఎంకేఎస్‌వై, వాటర్‌షెడ్ పథకం కింద సోమల, సదుం మండలాల్లోని లబ్ధిదారులకు మంజూరైన వ్యవసాయ పనిముట్లను మంత్రి పంపిణీ చేశారు. 766 మంది లబ్ధిదారులకు రూ. 1.38 కోట్ల విలువైన పనిముట్లు మంజూరు చేశారని డ్వామా పీడీ గంగాభవాని, అడిషనల్ పీడీ ఉమావాణి తెలిపారు.

**సోలార్ లైట్లు పంపిణీ**

అలాగే, మండలంలో 50మంది చిరు వ్యాపారులకు మంజూరైన సోలార్ లైట్లను మంత్రి పెద్దిరెడ్డి లాంఛనంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, డీఆర్‌ఓ రాజశేఖర్, చిత్తూరు, కడప డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ గిరిబాబు, శివరాం, చిత్తూరు, రాయచోటి జిల్లా రిజిస్ట్రార్లు ఉషారాణి, మునిశేఖర్, సబ్‌రిజిస్ట్రార్లు పద్మ



సోలార్ లైట్లు పంపిణీ చేస్తున్న మంత్రి

శేఖర్‌రెడ్డి, బాలాజి, నీరజ, నాయకులు రెడ్డెప్పరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, పుత్రాజు, అమాస మోహన్, నాగభూషణంరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

# థ్యాంక్యూ సార్!



మంత్రి పెద్దిరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం ఇస్తున్న జ్యోతి, సీకాం విద్యాసంస్థల చైర్మన్ సురేంద్రనాథరెడ్డి

**పులిచెర్ల(కల్లూరు):** మండలంలోని మిట్టమీద రాచపల్లెకు చెందిన వి.జ్యోతి, సీకాం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ టి.సురేంద్రనాథరెడ్డిని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పాలకమండలి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లుగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియమించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జ్యోతి భర్త, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు హేమసుందర్‌రెడ్డితో పాటు సీకాం సంస్థల అధినేత మంత్రిని తిరుపతిలోని వకుళామాత ఆలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతలు నిర్వర్తిస్తామని పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అక్కడ నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# తల్లీబిడ్డ సంరక్షణకే ‘వైఎస్సార్ పోషణ’



కట్టకిందపాళ్యంలో పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ పద్మావతి



కోనేటిపాళ్యంలో..

**పుంగనూరు:** తల్లి,బిడ్డలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సంపూర్ణ పోషణను ప్రవేశపెట్టారని కౌన్సిలర్ పూలత్యాగరాజు అన్నారు. శుక్రవారం కోనేటిపాళ్యంలోని అంగన్‌వాడీ కేంద్రంలో త్యాగరాజు కట్టకిందపాళ్యంలో కౌన్సిలర్ పద్మావతి పోషణ కిట్లు, కోడిగుడ్లను పంపిణీ చేసి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పోషణ పదార్థాలతో గర్భవతులు, బాలింతలు, పిల్లలు ఎంతో ఆరోగ్యంగా ఉన్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం ప్రైమరీ స్కూళ్లుగా మార్చి, భోజన పథకం అమలు చేస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



కుప్పం : ఆర్థిక సాయం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్

**కుప్పం:** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైఎస్సార్ సీపీ క్రియాశీలక కార్యకర్త సురేష్ కుటుంబానికి ఎమ్మెల్సీ భరత్ ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ డా.సుదీర్ మృతుడి కుటుంబాన్ని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఆదేశానుసారం రూ.10 వేలను అందజేశారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**శాంతిపురం మండలంలో..**

**శాంతిపురం:** మండలంలోని రాళ్లబూదుగూరులో శుక్రవారం మాణిక్యాలరావు మృతి చెందాడు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ రూ.10 వేల ఆర్థిక సాయాన్ని స్థానిక సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు రమేష్ చేతుల మీదుగా అందజేశారు. మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు నిసార్, వైస్ సర్పంచ్ వెంకట్రమణ, సచివాలయ కన్వీనర్ రఘుపతి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## నేడు రాజన్న వర్ధంతి

**పుంగనూరు:** మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని శనివారం నిర్వహించనున్నారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో బస్టాండు వద్ద రాజన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. అలాగే అన్నదానం చేయనున్నారు.

## బిల్లేరులో కొనసాగుతున్న వైద్య శిబిరం

**చౌడేపల్లె:** మండలంలోని కొండయ్యగారిపల్లె పంచాయతీ బిల్లేరులో వైద్య శిబిరం కొనసాగుతోంది. ఇక్కడ విషజ్వరాలు విజృంభించడంతో సాక్షి ప్రచురించిన కథనంపై ఉన్నతాధికారులు స్పందించి ఐదురోజుల పాటు వైద్యశిబిరం ఏర్పాటు చేయడం విదితమే. డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి తొలిరోజు గ్రామాన్ని సందర్శించడం, రోగులను పరామర్శించడం విదితమే. వైద్యసిబ్బంది రోజూ జ్వర పీడితులను పరీక్షిస్తున్నారు. మందులు ఇస్తున్నారు. పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నారు.

## మొక్కలు పంపిణీ

**గంగవరం:** పలమనేరు పట్టణంలో జీవిత బీమా సంస్థ 67వ వ్యవస్థాపక దినోత్సవానికి ఘనంగా నిర్వహించారు. ×ప్రకృతి¥ కన్వీనర్ మల్లిచెట్ల దేవేంద్ర ఎల్‌ఐసీ ఉద్యోగస్తులకు పలురకాల మొక్కలు పంపిణీ చేశారు. పట్టణంలో మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

## నేడు ప్రత్యేక పూజలు

**పెద్దపంజాణి:** శ్రావణ మాసం సందర్భంగా శనివారం మండలంలోని ముద్దేపల్లె సమీపంలో దేవరగుట్టపై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీగోవిందరాజులస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం గోపూజ, గణపతి పూజ, పాలాభిషేకం, విశేష హోమాలు చేస్తామని, మధ్యాహ్నం దేవర ఎద్దు ఊరేగింపు, అన్నదానం, రాత్రి వీధి నాటక ప్రదర్శన ఉంటుందని వివరించారు.

# ప్రభోదామృత కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



కుప్పం : మాట్లాడుతున్న తిమ్మరాయ స్వామి ట్రస్టు సభ్యులు

**కుప్పం:** పట్టణ సమీపంలో గుత్తార్లపల్లెలోని శ్రీ ప్రసన్న తిమ్మరాయస్వామి దేవాలయంలో శనివారం నిర్వహించనున్న సద్గురు శ్రీ యోగినారాయణ యతీంద్ర ప్రభోదామృత కార్యక్రమాన్ని భక్తులు విజయంతం చేయాలని దేవస్థాన ట్రస్టు సభ్యులు కోరారు. శుక్రవారం దేవాలయ ప్రాంగణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన కైవారం శ్రీ సద్గురు యోగినారాయణ మఠం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మఠం దాసోహ దాసు ఎంఆర్ జయరాం, సంచాలకులు వారవాసి బాలకృష్ణ భాగవతార్ ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఉదయం 10 గంటలకు పట్టణంలోని శ్రీ రామలింగేశ్వ దేవాలయంలో పూజలు నిర్వహించి కైవారం మఠ భజన బృందం పురవీధుల్లో నారాయణ నామస్మరణ చేస్తూ ప్రసన్న తిరుపతి గంగమ్మ దేవాలయం, సోమేశ్వర స్వామి దేవాలయాల్లో పూజలు చేస్తుందని, ఆ తర్వాత తిమ్మరాయస్వామి ఆలయానికి చేరుకుంటుందన్నారు. సాయంత్రం 4 గంటలకు ప్రముఖుల ఉపన్యాసాలు, ప్రవచనాలు ఉంటాయన్నారు. రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో తిమ్మరాయస్వామి ట్రస్టు అధ్యక్షులు వెంకటాచలం, సభ్యులు యువరాజ్, వెంకటాచలం, నవీన్, అశోక్, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

**గుడుపల్లె:** గుత్తార్లపల్లెలో శనివారం నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బలిజ సేవా సంఘం నాయకులు ప్రభాకర్, గోపినాథ్ కోరారు. ఉదయం కుప్పంలో సద్గురు శ్రీ యోగి నారాయణ చిత్రపటంతో ర్యాలీ అనంతరం గుత్తార్లపల్లె దేవాలయం వద్ద మహా సభ నిర్వహిస్తామన్నారు.

## 3న గద్దర్ సంస్మరణ సభ

**పుంగనూరు:** ప్రజా గాయకుడు గద్దర్ సంస్మరణ సభను ఈనెల 3న అంబేడ్కర్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు దళిత నాయకులు మునస్వామి, శ్రీరాములు శుక్రవారం తెలిపారు. ముఖ్య అతిథులుగా చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతితో పాటు పలువురు దళిత నేతలు హాజరవుతారని, ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

**పులిచెర్ల(కల్లూరు):** కల్లూరు బీసీ కాలనీ సమీపంలోని మామిడి తోపులో పేకాట ఆడుతున్న ఐదుగురిని శుక్రవారం అరెస్టు చేసినట్లు కల్లూరు ఎస్‌ఐ రవి ప్రకాష్ రెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.6030 స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

## లారీని ఆటో ఢీ డ్రైవర్‌కు తీవ్రగాయాలు

**గంగవరం:** రోడ్డు పక్కన ఆగివున్న లారీని వెనుక నుంచి ఆటో ఢీకొనడంతో డ్రైవర్ తీవ్రంగా ఆగాయపడిన సంఘటన గురువారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాలు.. పలమనేరులోని పాతపేట జెండామానికి చెందిన సుబ్రమణ్యం కిరాయికి ప్యాసింజర్ ఆటో నడిపేవాడు. పలమనేరు నుంచి కొంతమందిని పంజాణిలో దించి తిరిగి వస్తుండగా సామరాజుపల్లె రోడ్డు పక్కన పంక్చర్ షాపు వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సుబ్రమణ్యంకు తీవ్ర గాయాలయ్యాయి. హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అతడిని చికిత్స నిమిత్తం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కోనేటిరాయుని సేవలో చిత్తూరు సబ్ కలెక్టర్



సబ్‌కలెక్టర్ దంపతులను సత్కరించిన ఆలయ సిబ్బంది

**గంగవరం:** మండలంలోని కీలపట్ల శ్రీ కోనేటిరాయ స్వామి ఆలయంలో శుక్రవారం జరిగిన స్వామివారి ఆర్జిత అభిషేక సేవలకు చిత్తూరు సబ్ కలెక్టర్ రాజశేఖర్ దంపతులు హాజరయ్యారు. స్వామివారి దర్శనానంతరం వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ పర్యవేక్షకులు గజేంద్ర, అర్చకులు కలిసి సబ్‌కలెక్టర్ దంపతులను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఆలయ ప్రధానార్చకులు దేవరాజాచార్యులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# పౌర హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ మురళి

**రామకుప్పం:** మండలంలోని బందార్లపల్లె పంచాయతీ సగినేకుప్పంలో శుక్రవారం పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మురళి మాట్లాడుతూ ప్రజలు పౌర హక్కులతోపాటు విధులపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. అందరూ విద్యావంతులు కావాలన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తోందని, ఈ రంగంలో కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీఓ రాధాకృష్ణ మాట్లాడుతూ, గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ విద్యాలయపై ప్రతిజ్ఞ



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న హెచ్‌ఎం ఎల్లయ్య

**సోమల:** స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సోమల ప్రాథమిక పాఠశాలలో ఉదయం విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. నీటి వృథా అరికట్టడం, ఇతర అంశాలపై విద్యార్థులతో హెచ్‌ఎం ఎల్లయ్య ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వహాబ్‌జాన్, ఇందిరాంబ, బేబి, షంషాద్ బేగం, రమణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో సత్తా..ఎక్సలెన్సీ అవార్డుతో జోష్



క్రీడా ఎక్సలెన్సీ అవార్డు అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీలు

**ఐరాల:** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ఎక్సలెన్సీ పురస్కారం అందుకున్నట్టు శుక్రవారం హెచ్‌ఎం కోమల తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులు, పీడీలను హెచ్‌ఎం అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన విధానాల్లో భాగంగా అత్యున్నత ప్రతిభ కనబరచిన ఐదు పాఠశాలలకు జిల్లాలో క్రీడా ప్రతిభా పురస్కారాలు ప్రకటించారన్నారు. ఇందుకుగాను జిల్లా నుంచి జాతీయ, రాష్ట్ర స్థాయి జోనల్స్‌లో ప్రతిభ కనబరచిన ఐదు పాఠశాలలను ప్రామాణికంగా ఎంపిక చేశారన్నారు. వీటిలో తమ హైస్కూలు మొదటి స్థానంలో నిలిచిందని, జాతీయ క్రీడా దినోత్సవం రోజున డీఈఓ విజయేంద్రరావు క్రీడా ఎక్సలెన్సీ అవార్డును తమ స్కూలుకు అందజేసినట్లు ఆమె చెప్పారు.

# సాకారమైన జూనియర్ కళాశాల కల



విద్యార్థినులకు యూనిఫాం దుస్తులు పంపిణీ చేస్తున్న రాజేశ్వరమ్మ

**తవణంపల్లె:** విద్యార్థుల సౌకర్యార్థం అరగొండలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలన్న మండలవాసుల కల సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాకారం చేశారని మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు రాజేశ్వరమ్మ తెలిపారు. మండలంలోని అరగొండలో నూతనంగా ఏర్పాటు చేసిన బాలికల జూనియర్ కళాశాలలోని 36 మంది విద్యార్థినులకు శుక్రవారం ఆమె రెండు జతల యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# జోరుగా పింఛన్ల పంపిణీ



పుంగనూరు : రహమత్‌నగర్‌లో..



పుంగనూరు : మంగళం కాలనీలో..



పుంగనూరు : నక్కబండలో..

**పుంగనూరు:** మున్సిపాలిటీ పరిధిలోని 31వ వార్డుల్లో అర్హులైన 147 మంది లబ్ధిదారులకు నూతన పెన్షన్లు పంపిణీ చేశారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పెన్షన్లు పంపిణీ చేశారు. రహమత్‌నగర్‌లో సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దీన్ షరీఫ్, కౌన్సిలర్ సాజిదాబేగం, నక్కబండలో మనోహర్ పెన్షన్లు పంపిణీ చేశారు. అలాగే కౌన్సిలర్లు అమ్ము, కిజర్‌ఖాన్, నరసింహులు, పూలత్యాగరాజు, జెపి.యాదవ్, కాళిదాసు, పద్మావతి, భారతి తదితరులు ఆయా వార్డులలో నూతన పెన్షన్లు, పాత పెన్షన్లు పంపిణీ చేశారు.

**మండలంలో...**

మండలంలోని 23 పంచాయతీలలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ నారాయణ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పంచాయతీలలో సర్పంచులు, వలంటీర్లు పెన్షన్లను పంపిణీ చేశారు.

**సోమలలో..**

**సోమల:** మండలంలో శుక్రవారం వేకువ జాము నుంచే సామాజిక పెన్షన్లను ప్రజాప్రతినిధులు, జేసీఎస్ కన్వీనర్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పంపిణీ చేశారు. పొదలగుంటపల్లెలో మండల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు నాగభూషణం రెడ్డి, నంజంపేటలో సర్పంచ్ వెంకటరెడ్డి, సోమలలో జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు, మండల కో–ఆప్షన్ సభ్యుడు మస్తాన్ సాహెబ్, సచివాలయ కన్వీనర్లు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఐలా సురేంద్ర, మొగిలప్పగారి శ్రీనివాసులు, రమణ, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

**సదుం మండలంలో..**

**సదుం:** మండలంలోని 11 సచివాలయాల పరిధిలో శుక్రవారం పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. పంపిణీలో స్థానిక ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు పాల్గొన్నారు. వేకువ జామునే పింఛన్లు అందడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

**మండలానికి కొత్తగా 367 పింఛన్లు**

**శాంతిపురం:** మండలంలోని 367 మంది లబ్ధిదారులకు సెప్టెంబర్ నెల నుంచి కొత్తగా 367మందికి పింఛన్లు మంజూరు చేశామని ఎంపీడీఓ హేమమాలిని తెలిపారు. అలాగే మరో 261 పింఛన్లు పరిశీలనకు వచ్చినట్లు చెప్పారు. ఇక, కొత్తగా సొన్నేగానిపల్లె పంచాయతీలో మంజూరైన 11 పింఛన్లను జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణమూర్తి, స్థానిక పంచాయతీ కార్యదర్శి రవినాయక్, సర్పంచ్ మంజునాథరెడ్డి, మండల యువత అధ్యక్షుడు విజయకుమార్ పంపిణీ చేశారు.



సోమల : పొదలగుంటపల్లెలో..



సదుం: అమ్మగారిపల్లెలో..



శాంతిపురం: పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు